ఊరూరా గ్రామసభలు

సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం

సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే

షాద్‌నగర్‌టౌన్, జనవరి 21: సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన షాద్‌నగర ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తరపున సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా శశిధర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా శ్రీలత, కార్యదర్శిగా శ్రీదేవి, కోశాధికారిగా ఉమ, యువజన సంఘం అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్‌ను ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఈ నెల 24న డ్రైవర్స్ డే వేడుకలు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 21: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 24న డ్రైవర్స్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు డీఎం ఉష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్స్ డే పురస్కరించుకుని డ్రైవర్ల పట్ల కృతజ్ఞతాభావంతో బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ నెల 31వరకు కొనసాగనున్న మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సురక్షిత డ్రైవింగ్‌పై డ్రైవర్ల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 25లోపు తమ పేర్లను బస్టాండ్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామన్నారు.

జిల్లాస్థాయి ఆంగ్లభాష పోటీలకు విద్యార్థుల ఎంపిక

షాద్‌నగర్‌రూరల్, జనవరి 21 : ఫరూఖ్‌నగర్ మండలంలోని విద్యాల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్వేత, సంధ్య, నయీం, కార్తీక్ జిల్లాస్థాయి ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఒలంపియాడ్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో రాణించి జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొననుండడం సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

మంచాల, జనవరి 21: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1988-89బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు మంగళవారం మంచాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యా బోధన చేసిన గురువులను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

చేవెళ్ల రూరల్, జనవరి 21 : భార్యను హత్య చేసిన భర్తకు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది. మోకిలా సీఐ వీరాబాబు తెలిపిన కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ గ్రామంలోని ఇద్రారెడ్డినగర్ కాలనీ ఫేజ్-2లో నివసించే జల్పేట్ మాణిక్యం(48) భార్య జల్పేట్ యాదమ్మ(45)ను అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానించేవాడు. 2024 మే 5వ తేదీన ఆమె నిద్రించే సమయంలో తలపై బండరాయితో కొట్టి హత్య చేశాడు. నిందితుడిని మే 6వ తేదీన అరెస్ట్ చేసి జూలై 30న చార్జిషీటు దాఖలు చేసి రంగారెడ్డి జిల్లా కోర్టుకు సమర్పించారు. విచారణ చేపట్టిన జడ్జి ఎన్. శశిధర్‌రెడ్డి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దఅంబర్‌పేట, జనవరి 21: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. తారామతిపేట గ్రామ రెవెన్యూ సద్దుపల్లి శివారులోని ఓ ఇటుకల కంపెనీ వెనక గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 45 నుంచి 50 ఏండ్ల వయసున్న వ్యక్తి నేవీ బ్లూ ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్స్ వేసుకుని ఉన్నాడు. మృతదేహం గుర్తించలేని విధంగా ఉందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దఅంబర్‌పేట, జనవరి 21: వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి బాలయ్య (56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతకగా.. మంగళవారం ఉదయం గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. బాలయ్య కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు, జనవరి 21: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే కానిస్టేబుల్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం జరిగింది. వివరాల కోసం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ 9441407039, 9848090426లో సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

జాబితాలో పేర్లు లేవని గ్రామస్తుల ఆందోళన
పలు చోట్ల అధికారులను నిలదీసిన జనం
రేషన్‌కార్డు సహా పలు సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిబట్లలో తనకు పింఛన్ రావడంలేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎదుట గోడు వినిపిస్తున్న వృద్ధురాలు

ఆదిబట్ల, జనవరి 21: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆదిబట్లలో ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి మొదటి దఫా 3500 ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ముందుగా ఇల్లు లేని సఫాయి కార్మికులు, వితంతువులు, గుంట భూమి లేని పేదలకు, దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అదే విధంగా అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. భూమిలేని మహిళలకు సంవత్సరానికి రూ.12వేల ఇందిరమ్మ భరోసాను ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు.

రుణమాఫీ వివరాలు లేకుండా ఎందుకు వచ్చారు..

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసినా ఎందుకు రైతుల రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సునీతను నిలదీశారు. నియోజకవర్గంలో ఎంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని వివరాలు చెప్పండి అని ఎమ్మెల్యే వ్యవసాయశాఖ అధికారిణి సునితను అడగడంతో తన వద్ద పూర్తి సమాచారం లేదని వాపోయారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే సమాచారం లేకుండా సభలకు ఎందుకు వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి జోక్యం చేసుకుని నియోజకవర్గంలో 13 వేల మందికి రుణమాఫీ కాలేదని చెప్పారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, కౌన్సిలర్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, నాయకులు రజినికాంత్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, జమ్మ రాజు పాల్గొన్నారు.

కొంగరకలాన్‌లో అధికారులను నిలదీత...

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని ప్రజలు కొంగరకలాన్ గ్రామంలో అధికారులను నిలదీశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ 5,6,7,8,14వ వార్డుల్లో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులను నిలదీశారు. దీంతో కాసేపు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. బీఆర్ఎస్ నాయకులు నర్సగళ్ల ప్రవీణ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు చెప్పి స్థానిక అధికారులను కాంగ్రెస్ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని వారు కోరారు.

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడలో నిర్వహించిన వార్డు సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనితాశ్రీనివాస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నరసింహారావు, ఏడీఏ రాజారత్నం, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భరత్, నాయకులు వీరమోని దేవేందర్, మహేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే కొత్తూరు మండలంలో గూడూరులో జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో అరుంధతి, మాజీ సర్పంచ్ సత్తయ్య, ఉప సర్పంచ్ దయానంద్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు సురేశ్, అలాగే పెంజర్లలో జరిగిన గ్రామ సభలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నాయకులు బాల్‌రాజ్, దేశాల భీమయ్య పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట: మున్సిపాలిటీ పరిధి పెద్దఅంబర్‌పేట, పసుమాముల, కుంట్లూరు, తట్టిఅన్నారం, మర్రిపల్లి తదితర చోట్ల వార్డు సభలు నిర్వహించారు. పలు సభలను మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పెద్దఅంబర్‌పేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ, కుంట్లూరులో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, పలు వార్డుల్లో కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, రాజేందర్ ముదిరాజ్, గీత, సుజాత తదితరులు మున్సిపల్ అధికారుల సమక్షంలో దరఖాస్తులను స్వీకరించారు.

నందిగామ మండలంలో..

నందిగామ : నందిగామ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని రంగాపూర్, చాకలిగుట్టతండా, నర్సప్పగూడ, బండోనిగూడ, బుగ్గోనిగూడ, ఈదులపల్లి, మామిడిపల్లి గ్రామంలో మంగళవారం ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించారు. నందిగామ గ్రామ సభలో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, ఎంపీవో తేజ్ సింగ్, ఏవో వాణిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మయ్య, ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ : మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి హాజరై మాట్లాడారు. బుధవారం ఇంజాపూర్, కమ్మగూడ, తుర్కయాంజాల్, ఉమర్ఖాన్ దాయరలో వార్డు సభలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ శివలింగంగౌడ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

యాచారం : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని మంధన్‌గౌరెల్లిలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామంలో అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసాను రాజకీయాలకతీతంగా అందివ్వాలని కోరుతూ స్పెషల్ ఆఫీసర్(మండల పంచాయతి ఆఫీసర్) శ్రీలతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు కిషన్, మాన్‌సింగ్, రాజేందర్ పాల్గొన్నారు.

చేవెళ్ల పంచాయతీ కార్యాలయంలో

చేవెళ్లటౌన్ : చేవెళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో హిమబిందు అధ్యర్యంలో నిర్వహించిన గ్రామ సభలో డీపీవో సురేశ్‌మోహన్ పాల్గొని మాట్లాడారు. ఈ సభలో మాజీ ఎంపీటీసీ వసంతం, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, చేవెళ్ల ఏఈవో బాల కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ..

పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో రేషన్ కార్డు లేని వారు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా పథకాల కోసం మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు.

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లి, కోనాపూర్, కొత్తకుంట తండా, చెన్నంపల్లి, చింతలపల్లి గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని చంద్రాయన్‌పల్లి, జంగారెడ్డిపల్లి, 6.7, 11,14వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గ్రామ సభల్లో ఎమ్మార్వో లలిత, ఎంపీడీవో మాధురి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ వసంత, ఆర్ఐ చెన్నకేశవులు, సంపత్, సర్వేయర్ రవి, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు వార్డు అధికారులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల పరిధిలోని అన్నాస్‌పల్లి, నార్లకుంటతండా, బాలాజీనగర్, గడ్డమీదితండా, గోవిందాయిపల్లితండా, చల్లంపల్లి, కొండ్రిగానిబోడు తండాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు సంబంధించి ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామేశ్వరిదేవి, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ ముంతాజ్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలు ప్రారంభం

మాడ్గుల : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు గ్రామ ప్రజల సమక్షంలో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. మంగళవారం కాట్రగాని తండాలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో పద్మావతి పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చర్యలు

షాబాద్ : గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడుతామని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని సోలీపేట్, ఏట్ల ఎర్రవల్లి, మద్దూరు, తిమ్మారెడ్డిగూడ, నాగరగూడ, కేశవగూడ, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ, పోతుగల్, సీతారాంపూర్, మల్లారెడ్డిగూడ, ముద్దెంగూడ, దామర్లపల్లి, లింగారెడ్డిగూడ తదితర గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను గ్రామసభలలో చదివి వినిపించారు. అర్హులకు పథకాలు అందేలా చూస్తామని, మిగిలిపోయిన లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏవో వెంకటేశం, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం నర్సింహులు, ఏపీవో వీరాసింగ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్ : సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బన్సీలాల్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ తదితర పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పథకాలకు అర్హులైన వారు జాబితాలో పేర్లు లేకుంటే దరఖాస్తులు అందజేయాలన్నారు. రైతుభరోసా పథకం ద్వారా రెండు విడుతల్లో రూ.12000 ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 3620 జనాభా కలదని, ఇప్పటికే 710 రేషన్‌కార్డులు కలవన్నారు. నూతన రేషన్ కార్డులు, ఇతర మార్పుల కోసం మొత్తం 187 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 38 మంది లబ్ధిదారులు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కావలిశ్రీశైలం, భవానీమాతఆలయా చైర్మన్ ముత్యాలరాజు, మాజీవార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

యాచారం : గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందివనపర్తి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని నందివనపర్తి, నజ్జికొసింగారం, మంధన్‌గౌరెల్లి, అయ్యవారిగూడ, కేసీతండా, మల్కీజ్‌గూడ ప్రత్యేకాధికారుల అధ్యక్షతన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న జాబితాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. తమ పేర్లు రాక మహిళలు ఆందోళన చెందడంతో సెంటు భూమి లేకుండా 2023-24లో కనీసం 20రోజులు ఉపాధి హామీ పథకం చేసిన వారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ..పేర్లు రానివారు ఆందోళన చెందొద్దని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్, ఏవో రవినాథ్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : మండల పరిధిలోని మేడిపల్లి, రెడ్డిపల్లి, చందానగర్, వెంకటాపూర్, శ్రీరాంనగర్, అమ్డాపూర్, మూర్తుజాగూడ, ఎన్కేపల్లి మొయినాబాద్ గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు అర్హత పొందిన వారి జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించి ఆ జాబితాను చదివి వినిపించారు. ఎన్కేపల్లిలో తహసీల్దార్ గౌతంకుమార్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించగా, మొయినాబాద్‌లో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి , మేడిపల్లి గ్రామంలో ఎంపీడీవో సంధ్యల ఆధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేశారు.

కొంగరకలాన్ గ్రామంలో కాంగ్రెస్ నేతలకే రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని అధికారులను నిలదీస్తున్న మహిళ

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

యాచారం, జనవరి 21 : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి. అంజయ్య అన్నారు. మండలంలోని ధర్మన్నగూడ గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి మంగళవారం సీపీఎం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం గ్రామంలో మాస్ ఫండ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ ఎన్నికల ముందిచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయలేకపోయిందని మండిపడ్డారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ఫార్మాసిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు బాధిత రైతులకు సీపీఎం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఎం ఉద్యమాలు లేవనెత్తనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 25నుంచి 28వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేశ్, సత్యనారాయణ, గోపాలకృష్ణ, రామారావు, సురేశ్, సుల్తాన్ కిష్టయ్య తదితరులున్నారు.

సీపీఐఎం వాల్ పోస్టర్ విడుదల

మాడ్గుల : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సిపిఐఎం పార్టీ నాయకులు మంగళవారం పార్టీ 4వ రాష్ట్ర మహసభలకు సంబధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. సిపిఐఎం పార్టీ మండల కార్యదర్శి పులికంటి రమేశ్ మాట్లాడుతూ జనవరి 25 నుండి 28 వరకు పీఎస్ఆర్ గ్రౌడ్ సంగారెడ్డిలో జరిగే మహసభలకు ప్రజలు భారీగా తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలోని నాయకులు కట్ట అంజయ్య, గజ్జ అంజయ్య, శ్రీను, నర సింహ, మెట్టు శివ, రాశిక మహేశ్, రాశిక అంజయ్య, శివ శంకర్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాప్రదర్శను విజయవంతం చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 21 : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు- వేల గొంతులు' మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాదిగ జేఏసి అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్ అన్నారు. మండలంలోని అనాజ్‌పూర్, మజీద్‌పూర్ గ్రామాల్లో మాదిగలు నిర్వహించిన డప్పుల ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 30 ఏండ్ల వర్గీకరణ పోరాటం, వర్గీకరణ సాధనకు ఫిబ్రవరి 7వ తేదీన జాతి ఆకాంక్షను ప్రపంచానికి వినిపించేలా మహోత్తర ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. మాదిగ జాతి బిడ్డల భవిష్యత్ కోసం, ఉద్యోగాల కోసం జాతి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యాదయ్య, సభ్యులు ఏర్పుల శ్రీనివాస్, యాదయ్య, బుచ్చిరాములు, అనాజ్‌పూర్ గ్రామస్తులు ఏర్పుల దానయ్య, ఏర్పుల గిరి, పెద్దబాల్‌రాజ్, బాలనర్సింహ, మజీద్‌పూర్ గ్రామస్తులు సీహెచ్ శ్రీనివాస్, శివశంకర్, అనుపాటి కృష్ణ, శివరాల దానయ్య, సీహెచ్ లింగస్వామి, ధర్మతేజ, నాగార్జున, పరమేశ్, జగన్, ఎమ్మార్పీఎస్ కార్యదర్శి సీహెచ్ విజయ్‌కుమార్, రాజు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరిస్తాం

కడ్తాల్, జవనరి 21: నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన శైలజా, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. విద్యార్థిని కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ఇటీవల మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, మల్లేశ్... ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థిని ఉన్నత చదువుకు ట్రస్ట్ తరపున రూ.25 వేల చెక